• 'బాస్ లేరు.. మనకేంటి?'

భద్రాద్రి కొత్తగూడెం కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజావాణికి కలెక్టర్ జితేష్ వీ పాటిల్ హాజరుకాకపోవడంతో అధికారులు ముచ్చట్లు పెట్టుకోవడం పలు విమర్శలకు దారితీసింది. అదనపు కలెక్టర్ విద్యాచందన, ఏవో గన్యానాయక్ ప్రజల దరఖాస్తులను స్వీకరించి పరిశీలిస్తుండగా జిల్లా అధికారులు మాత్రం ఫోన్లు చూసుకుంటూ సొంత పనుల్లో నిమగ్నమయ్యారు. ప్రజా సమస్యలను గాలికి వదిలేసిన అధికారుల తీరుపై ప్రజలు అసహనం వ్యక్తం చేశారు. – భద్రాద్రి కొత్తగూడెం, నమస్తే తెలంగాణ

బీసీ రిజర్వేషన్లపై యాక్షన్ ప్లాన్

- కుల గణన ఆధారంగా ఎన్నికలకు వెళ్తే ఎలా ఉంటుంది?
- పంచాయతీ ఎన్నికలపై సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, జూలై 15 (నమస్తే తెలంగాణ): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల పెంపుపై కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. పంచాయతీ ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల పెంపు అంశంపై సచివాలయంలో సీఎం అధ్యక్షతన సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికల్లో రిజర్వేషన్ల అమలు, రాబోయే ఎన్నికల్లో వాటి పెంపునకు సంబంధించిన అంశాలను వెల్లడించాలని అధికారులకు సీఎం సూచించారు. గత పంచాయతీ ఎన్నికల్లో అనుసరించిన విధానం, రానున్న పంచాయతీ ఎన్నికలకు సన్నద్ధమవుతున్న తీరును రేవంత్‌కు అధికారులు వివరించారు. ఇప్పటికే కులగణనకు ఆమోదం తెలిపినందున, దాని ఆధారంగా పంచాయతీ ఎన్నికలకు వెళితే ఎలా ఉంటుందని, అందుకు ఎంత సమయం తీసుకుంటారని అధికారులను సీఎం ప్రశ్నించారు. కర్ణాటకలో 2015లో, బీహార్‌లో 2023లో కుల గణన చేశారని, ఆంధ్రప్రదేశ్‌లో కులగణన చేసినా వివరాలు ఇంకా బయట పెట్టలేదని అధికారులు వివరించారు. 2011లో కేంద్ర ప్రభుత్వం అనుసరించిన కులగణన ఫార్మాట్ 53 కాలమ్స్‌తో ఉన్నదని, దానికి మరో మూడు కాలమ్స్ జోడించి కులగణన చేపడితే కనీసం అయిదున్నర నెలల సమయం పడుతుందని తెలిపారు. బీసీ రిజర్వేషన్ల పెంపుతో పాటు స్థానిక సంస్థలకు కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధులు ఆగిపోకుండా త్వరగా ఎన్నికలు నిర్వహించేందుకు అవసరమైన ప్రణాళిక సిద్ధం చేయాలని సీఎం ఆదేశించారు. ఈ సమావేశంలో రిజర్వేషన్ల పెంపు అంశంపై సుదీర్ఘ చర్చ సాగింది.

సందేహాలుంటే జానారెడ్డిని సంప్రదించండి

ఉమ్మడి రాష్ట్రం నుంచి తెలంగాణలో జరిగిన పంచాయతీ ఎన్నికల వరకు అనుసరించిన విధానాలు, వివిధ రాష్ట్రాల స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టులో దాఖలైన కేసులు, వాటి తీర్పులు, పర్యవసానాలను మాజీ మంత్రి జానారెడ్డి వివరించారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి స్పందిస్తూ.. పంచాయతీ ఎన్నికల్లో రిజర్వేషన్ల అమలుకు ఇప్పటి వరకు అనుసరించిన విధానాలపై కాల క్రమపట్టిక రూపొందించాలని, ఏవైనా సందేహాలు వస్తే మాజీమంత్రి జానారెడ్డితో పాటు పంచాయతీరాజ్‌శాఖ నిపుణులు, మాజీ ఉన్నతాధికారుల సలహాలు తీసుకోవాలని, చట్టపరమైన విషయాల్లో అడ్వకేట్ జనరల్‌తో చర్చించాలని సూచించారు. మిగతా రాష్ట్రాలు రిజర్వేషన్ల విషయంలో అనుసరిస్తున్న విషయాలపై అధ్యయనం చేయాలని ఆదేశించారు. త్వరగా ఆయా అంశాలపై నివేదిక రూపొందిస్తే శాసన సభ సమావేశాలకు ముందే మారోసారి సమావేశమై ఈ అంశంపై తుది నిర్ణయం తీసుకుందామని అన్నారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర రాజనరసింహ, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, ముఖ్యమంత్రి సలహాదారు వేంనరేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, మాజీ మంత్రి కే జానారెడ్డి, బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్ రిజర్వేషన్ల పెంపు సాధ్యాసాధ్యాలపై తమ అభిప్రాయాలను వెల్లడించారు. సమావేశంలో సీఎస్ శాంతికుమారి, సీఎం ముఖ్య కార్యదర్శి వీ శేషాద్రి, ముఖ్యమంత్రి కార్యదర్శి డాక్టర్ జీ చంద్రశేఖర్‌రెడ్డి, బీసీ సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, పంచాయతీరాజ్‌శాఖ కార్యదర్శి డీఎస్ లోకేశ్‌కుమార్, న్యాయశాఖ కార్యదర్శి రెండ్ల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా ఆధారంగా బీసీగణన

మొదటిపేజీ తరువాయి...

దాటకుండా రిజర్వేషన్ అమలు చేయాలని నిర్ణయించినట్టుగా విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. ఈ మేరకు సోమవారం పంచాయతీరాజ్, బీసీ కమిషన్ అధికారులతో జరిగిన సమావేశంలో ప్రాథమికంగా ఒక అంచనాకు వచ్చినట్టు సమాచారం. బీహార్ సహా పలు రాష్ట్రాల్లో కులగణన చేసి బీసీలకు రిజర్వేషన్లు పెంచినా కోర్టులు ఆ రిజర్వేషన్లను కొట్టివేశాయి. రిజర్వేషన్లు 50 శాతానికి మించవద్దని స్పష్టం చేశాయి. రాజ్యాంగం ప్రకారం 50 శాతం రిజర్వేషన్‌లు దాటవద్దని సుప్రీం కోర్టు కూడా తీర్పు ఇచ్చినందున బీసీలకు 24 శాతం కంటే ఎక్కువ సాధ్యం కాదని ప్రాథమికంగా ఒక నిర్ణయానికి వచ్చారు. స్థానిక సంస్థల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లను ఓటరు జాబితా ప్రకారం తేల్చాలని ప్రాథమికంగా ఒక అవగాహనకు ప్రభుత్వం వచ్చినట్టు సమాచారం. దీనిపై త్వరలోనే అధికారికంగా నిర్ణయం తీసుకొని రిజర్వేషన్లను ఖరారు చేయనున్నది. ఓటరు జాబితా ఆధారంగా వేసిన లెక్కల్లో ఎస్సీ, ఎస్టీలకు ఎంత జనాభా ఉంటే అంత రిజర్వేషన్‌ను ఆయా పంచాయతీలు, మండలాలు, జిల్లాలను ప్రాతిపదిక తీసుకొని అమలు చేస్తారు. 50 శాతంలో మిగిలిన రిజర్వేషన్‌ను బీసీలకు కేటాయిస్తారు. దీని ద్వారా సగటున బీసీలకు 24 శాతం మించకపోవచ్చని సామాజిక వేత్తలు అంచనా వేస్తున్నారు. గతంలో కూడా ఇదే విధానాన్ని అమలు చేశారని గుర్తు చేస్తున్నారు. గ్రామ స్థాయిలో అందుబాటులో ఉన్న గ్రామ కార్యదర్శులు, అంగన్‌వాడీ, ఆశవర్కర్ల ద్వారా పార్లమెంట్ ఎన్నికల ఓటరు జాబితాను ప్రామాణికంగా చేసుకొని లెక్కలు తీయనున్నారు. దీంతో బీసీలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీ ఉత్తి మాటే కానున్నదని బీసీ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. అయితే పంచాయతీలు, మండలాలు, ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యుల్లో ప్రస్తుతం ఉన్న రిజర్వేషన్లు పూర్తిగా మారే అవకాశాలు ఉంటాయని అధికారులు చెప్తున్నారు.

పారిశుద్ధ్య కార్మికుల వేతనాలకు నిధులు విడుదల

బీఆర్ఎస్ పోరాటానికి స్పందించిన ప్రభుత్వం

హైదరాబాద్, జూలై 15 (నమస్తే తెలంగాణ): పంచాయతీరాజ్ పారిశుద్ధ్య కార్మికులపై ప్రభుత్వం ఎట్టకేలకు కనికరం చూపింది. బీఆర్ఎస్ అనేక పోరాటాలు, ప్రభుత్వానికి విజ్ఞప్తులు, సీఎం రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖల పర్యవసానంతో వారి వేతనాలకు అవసరమైన నిధులను విడుదల చేసింది. సోమవారం జీపీలకు రూ.150 కోట్లు విడుదల చేస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ మొత్తాన్ని రాష్ట్రంలోని 29,676 మంది పారిశుద్ధ్య కార్మికుల వేతనాలను చెల్లించాలని సూచించింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామ పంచాయతీలకు ఒక్క పైసా నిధులు విడుదల చేయలేదు. దీంతో గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు కూడా ఇవ్వలేని పరిస్థితి దాపురించింది. దీంతో వారు గ్రామ పంచాయతీ, కలెక్టరేట్ల ముందు ఆందోళన చేశారు. బిక్షాటన చేశారు. ఈ సమస్యలన్నింటిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బీఆర్ఎస్ బహిరంగ లేఖ రాసింది. పారిశుద్ధ్య కార్మికులకు సంఘీభావాన్ని ప్రకటించి, ప్రభుత్వాన్ని తీవ్ర స్థాయిలో తప్పుపట్టింది. దీంతో ఎట్టకేలకు ప్రభుత్వంలో కదలిక వచ్చింది. మే వరకు వేతనాలను చెల్లించేలా నిధులను విడుదల చేసింది. అయితే ట్రాక్టర్ నిర్వహణ, ఇతర పనులకు నిధులు విడుదల చేయలేదు.

కుంభవృష్టి కురిసినా కరెంటు పోవద్దు: భట్టి

హైదరాబాద్, జూలై 15 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో కుంభవృష్టి కురిసినా విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చూసుకోవాలని విద్యుత్ అధికారులను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశించారు. సోమవారం ఆయన సచివాలయంలో విద్యుత్ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈదురుగాలు వీచినా, భారీ వర్షం ముంచెత్తినా, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సమీక్షలో ఇంధన శాఖ కార్యదర్శి రోనాల్డ్ రోస్, ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు అధికారులతో సీఎం సమావేశం

హైదరాబాద్, జూలై 15 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డి మంగళవారం కలెక్టర్లు, ఎస్పీలు, ఇతర అధికారులతో సమావేశం కానున్నారు. సచివాలయంలోని 7వ అంతస్థులో ఈ సమావేశం జరుగనున్నది. ప్రజాపాలన దరఖాస్తులు, ధరణి, వానకాలం పంటలు, సీజనల్ వ్యాధులు, వనమహోత్సవం, విద్యారంగం, మహిళా శక్తి క్యాంటీన్లు, శాంతిభద్రతలు, యాంటీ డ్రగ్ క్యాంపెయిన్‌పై చర్చించనున్నారు.

ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం జల్లేపల్లిలోని వీధిలో పెంట కుప్పను పరిశీలిస్తూ వెళ్తున్న మంత్రి పొంగులేటి

కాంగ్రెస్ వచ్చేనాటికి అప్పు 7 లక్షల కోట్లు

- ప్రభుత్వానికి నిధుల కొరత
- 'జల్లేపల్లి' జ్వరపీడితుల పరామర్శలో మంత్రి పొంగులేటి

తిరుమలాయపాలెం, జూలై 15: కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేనాటికి రాష్ట్రానికి రూ.7 లక్షల కోట్ల అప్పు ఉన్నదని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ప్రస్తుతం నిధుల కొరత ఉన్నా గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు అత్యవసరమని భావిస్తున్నట్టు తెలిపారు. అందుకోసం ముఖ్యమంత్రి, మంత్రులతో మాట్లాడి పంచాయతీలకు నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఖమ్మం తిరుమలాయపాలెం మండలం జల్లేపల్లిలో కొద్దిరోజులుగా ఇంటికి ఒకరిద్దరు చొప్పున జ్వరాలతో బాధపడుతుండటంతో కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్‌తో కలిసి సోమవారం ఆయన ఆ గ్రామాన్ని సందర్శించారు. కాలనీల్లో కలియదిరిగి అపరిశుభ్ర వీధులను పరిశీలించారు. జ్వర పీడితులను పరామర్శించి ధైర్యం చెప్పారు. మంత్రి మాట్లాడుతూ.. ఇందిరమ్మ ప్రభుత్వం గ్రామాల్లోని ప్రజలందరికీ అండగా ఉంటుందని అన్నారు. జల్లేపల్లిలో జ్వరాలతో బాధపడుతున్న వారిని గుర్తించి మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యాధికారులను ఆదేశించారు.

'కాళేశ్వరం'లో మీ పాత్ర ఏమిటి?

పలువురు ఐఏఎస్‌లు, మాజీ ఐఏఎస్‌లను ప్రశ్నించిన కమిషన్

హైదరాబాద్, జూలై 15 (నమస్తే తెలంగాణ): జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ సోమవారం పలువురు ఐఏఎస్‌లు, మాజీ ఐఏఎస్‌లను విచారించింది. 'కాళేశ్వరం ప్రాజెక్టులో మీ పాత్ర ఏమిటి?, అనుమతులు, ఆర్థిక అంశాల్లో మీరు ఎలాంటి పాత్ర పోషించారు?' అని ప్రశ్నించినట్టు తెలిసింది. ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఐఏఎస్ అధికారులు రాహుల్ బొజ్జా, స్మితా సబర్వాల్, వికాస్ రాజ్, మాజీ ఐఏఎస్‌లు సోమేశ్ కుమార్, రజత్‌కుమార్, ఎస్కే జోషి విచారణకు హాజరయ్యారు. వీరిలో ఎస్కే జోషి ఆన్‌లైన్‌లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు. ప్రాజెక్టు ప్రారంభం నుంచి అనేక కోణాల్లో వారిని ప్రశ్నించినట్టు సమాచారం. వివరణను అఫిడవిట్ రూపంలో వారం రోజుల్లోగా అందజేయాలని సూచించినట్టు తెలిసింది. బడ్జెట్ సమావేశాలు ఉండడంతో గడువు కావాలని రామకృష్ణారావు కోరగా, ఆగస్టు 5వరకు సమయం ఇచ్చినట్టు సమాచారం. విద్యుత్ శాఖ ఇంజినీర్ కే రఘు కూడా కమిషన్ ముందు హాజరయ్యారు.

ఎక్సైజ్‌శాఖలో రూల్స్ ఆధారంగానే బదిలీలు

హైదరాబాద్, జూలై 15 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర ఎక్సైజ్ శాఖలో త్వరలో చేపటనున్న బదిలీలు ఏ ప్రాతిపదికన చేపట్టాలనే రూల్స్‌ను ఇప్పటికే సీఎస్ శాంతికుమారి దృష్టికి ఎక్సైజ్‌శాఖ తీసుకెళ్లింది. ప్రభుత్వ ఆమోదం తర్వాత సాధారణ బదిలీల ప్రక్రియ కొనసాగనున్నది. కానిస్టేబుల్ నుంచి ఉన్నతాధికారుల వరకు 1500 మంది బదిలీకి అవకాశం ఉన్నట్టు సమాచారం.

31వరకు బదిలీల షెడ్యూల్

హైదరాబాద్, జూలై 15 (నమస్తే తెలంగాణ): ఇంటర్, సాంకేతిక, కళాశాల విద్యలో బోధన, బోధనేతర సిబ్బంది బదిలీలకు రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసింది. ఒకే చోట ఐదేండ్లు పూర్తైన వారు తప్పనిసరిగా బదిలీ కావాల్సి ఉండగా, రెండేండ్ల సర్వీసు పూర్తిచేసుకున్న వారు మాత్రమే బదిలీకి అర్హులుగా ప్రభుత్వం పేర్కొంది. మంగళవారం నుంచి బదిలీల ప్రక్రియ ప్రారంభంకానుండగా, 31 వరకు అవకాశమిచ్చారు. రాష్ట్రంలో ఉద్యోగుల బదిలీల ప్రక్రియ కొనసాగుతుండగా.. ఇంటర్, సాంకేతిక, కళాశాల విద్యాశాఖల్లో బదిలీల ప్రక్రియను చేపట్టలేదు. ఇదే అంశంపై 'ముందుకు సాగని బదిలీలు.. విద్యాశాఖలో ఇంకా విడుదల కాని మార్గదర్శకాలు' పేరుతో నమస్తే తెలంగాణ మెయిన్‌లో కథనం ప్రచురితమైంది. దీనిపై సర్కారు సోమవారం స్పందించి మార్గదర్శకాలు విడుదలచేసింది.

ఎస్సీ హాస్టల్ వెల్ఫేర్ బదిలీల్లో రగడ

హైదరాబాద్, జూలై 15 (నమస్తే తెలంగాణ) : షెడ్యూల్డ్ కులాల అభివృద్ధిశాఖలోని ఉద్యోగుల బదిలీల్లో అధికారుల తీరుపై హాస్టల్ వెల్ఫేర్ అఫీసర్లు అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఆందోళనకు దిగారు. దీంతో బదిలీలను కొద్దిసేపు వాయిదా వేశారు. డిపార్ట్‌మెంట్‌లోని పలు పోస్టుల బదిలీలకు సంబంధించి అధికారులు ఇప్పటికే షెడ్యూల్ ప్రకటించారు. అందులో భాగంగా సోమవారం డీఎస్ఎస్ భవన్‌లో కౌన్సెలింగ్ చేపట్టారు. అయితే ఈ కౌన్సెలింగ్ ప్రక్రియను పలువురు హెచ్‌డబ్ల్యూవోలు అడ్డుకున్నారు. లోకల్, నాన్‌లోకల్ ఖాళీలను ప్రత్యేకించి చూపకుండానే బదిలీ చేపట్టడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో అధికారులు కొద్దిసేపు కౌన్సెలింగ్‌ను నిలిపివేశారు.

శ్రీశైలంలో విద్యుత్తు ఉత్పత్తి ప్రారంభించాలి

హైదరాబాద్, జూలై 15 (నమస్తే తెలంగాణ) : శ్రీశైలం ప్రాజెక్టులో జల విద్యుత్తు ఉత్పత్తిని ప్రారంభించాలని కేఆర్ఎంబీ త్రీమెన్ కమిటీ నిర్ణయించింది. సోమవారం జలసౌధలో జరిగిన సమావేశంలో శ్రీశైలంలో విద్యుత్తు ఉత్పత్తి ప్రారంభించాలని, తద్వారా సాగర్ అవసరాలను తీర్చాలని ప్రకటించి తెలంగాణకు 5.5 టీఎంసీలు, ఏపీకి 4.5 టీఎంసీలను కేటాయించింది.

శ్రీశైలం నడక మార్గంపై నిషేధం

హైదరాబాద్, జూలై 15 (నమస్తే తెలంగాణ) : శ్రీశైలం మల్లికార్జున స్వామిని దర్శించుకునేందుకు నల్లమల అటవీ గుండా కాలినడకన వెళ్లే దారిని అటవీశాఖ 3నెలలపాటు నిషేధించింది. జూలై నుంచి సెప్టెంబర్ వరకు పులుల సంతానోత్పత్తి సమయం కావడంతో ఎన్టీసీఏ ఆదేశాల మేరకు సెప్టెంబర్ వరకు అనుమతి లేదని తెలిపింది. భక్తులు ఈ విషయాన్ని గమనించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలంది.

ఆన్‌లైన్‌లోనే 'సీఎంఆర్ఎఫ్'

హైదరాబాద్, జూలై 15 (నమస్తే తెలంగాణ) : సీఎం సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్)దరఖాస్తులను ఆన్‌లైన్‌లో స్వీకరించే ప్రక్రియ సోమవారం ప్రారంభమైంది. నిధుల దుర్వినియోగాన్ని అరికట్టేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు ప్రభుత్వం తెలిపింది. ఇందులో భాగంగా సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ ఆధ్వర్యంలో వెబ్‌సైట్ రూపొందించగా.. స్థానిక మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీకి లాగిన్ ఐడీ కేటాయించింది. సీఎంఆర్ఎఫ్ కోసం వారి వద్దకు వచ్చిన రోగుల వివరాలను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తారు. వీటితోపాటు వారి సిఫారసు లేఖను కూడా జత చేస్తారు. అప్లికేషన్‌ను పూర్తి చేసిన తర్వాత ప్రత్యేక నంబర్ కేటాయిస్తారు. అనంతరం ఒరిజినల్ మెడికల్ బిల్లులను సచివాలయంలోని సీఎంఆర్ఎఫ్ సెక్షన్‌లో సమర్పిస్తారు. వివరాలన్నీ సరైనవేనని నిర్ధారణకు వచ్చాకే వాటిని సీఎంఆర్ఎఫ్‌కు పంపుతారు. ఆ తర్వాత దరఖాస్తును ఆమోదించి లబ్ధిదారుడికి చెక్కు అందజేస్తారు.

అభిప్రాయ సేకరణలో రైతులేరి?

- రైతు భరోసాపై మంత్రుల కమిటీ అభిప్రాయ సేకరణ
- ముందుగా ఎంపిక చేసిన వారికే మాట్లాడే అవకాశం
- అభిప్రాయాలు చెప్పింది కాంగ్రెస్ ప్రజాప్రతినిధులే
- తమనెందుకు పిలిచారని రైతుల ఆగ్రహం

హనుమకొండ కలెక్టరేట్‌లో 'రైతు భరోసా' అభిప్రాయ సేకరణలో పాల్గొన్న మంత్రులు

వరంగల్, జూలై 15 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): రైతు భరోసా పథకం అమలు కోసం రైతుల అభిప్రాయం తీసుకుంటామంటూ ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలకు, వాస్తవ పరిస్థితులకు మధ్య ఏమాత్రం పొంతన కుదరడం లేదు. పంట పెట్టుబడి సాయంగా రైతులకు ప్రభుత్వం ఇవ్వనున్న రైతు భరోసాపై విధి విధానాల రూపకల్పన కోసం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ఆధ్వర్యంలోని మంత్రుల కమిటీ సోమవారం ఉమ్మడి వరంగల్ జిల్లాలో అభిప్రాయ సేకరణ చేపట్టింది. హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్, జనగామ, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల రైతులతో సమావేశం నిర్వహించినట్టు అధికారులు తెలిపారు. మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ, సీతక్క పాల్గొన్నారు. రైతుల నుంచి అభిప్రాయ సేకరణ అని చెప్పినప్పటికీ, అధికారులు ముందుగా రూపొందించిన జాబితాలో పేర్కొన్న వారికి మాత్రమే మాట్లాడే అవకాశం కల్పించారు. ఒక్కో అసెంబ్లీ సెగ్మెంట్ నుంచి ఇద్దరికి చొప్పున ఈ జాబితాలో చోటు కల్పించారు. స్థానిక ఎమ్మెల్యేలు సూచించిన పేర్లను అధికారులు జాబితాలో రాశారు. వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారద రైతుల పేరు, ఊరు, మండలం, జిల్లా వివరాలు ప్రకటించగానే ఆ వ్యక్తి అభిప్రాయం చెప్పారు. అధికారులు తయారుచేసిన జాబితాలో అందరూ కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు, నాయకులు, ఆ పార్టీకి చెందిన పీఏసీఎస్ చైర్మన్లు, డైరెక్టర్లు ఉన్నారు. అభిప్రాయ సేకరణ కార్యక్రమంలో వారు ఏం మాట్లాడాలో ఆదివారమే వీరికి స్పష్టంగా చెప్పారు. పేరు పిలిచిన వారే మాట్లాడాలని, మిగిలినవారు ఎవరూ లేచి మాట్లాడవద్దని కలెక్టర్ పలుమార్లు ఆదేశించారు. దీంతో విసిగిపోయిన రైతులు ఆ మాత్రానికి తమనెందుకు పిలిచారని ప్రశ్నించారు. మంత్రి తుమ్మల జోక్యం చేసుకుని జాబితాలో లేని మరో నలుగురితో మాట్లాడించారు. రైతుల అభిప్రాయాలు అని చెప్పి సమావేశానికి వచ్చిన కాకతీయ యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్, ప్రస్తుత పాలకమండలి సభ్యుడితోనూ మాట్లాడించారు. రైతు భరోసా విస్తృతస్థాయి సమావేశంలో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు, కార్పొరేటర్లు, కార్పొరేషన్ చైర్మన్లు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను మాత్రమే అనుమతించారని అఖిల భారత రైతు సమఖ్య హనుమకొండ జిల్లా కార్యదర్శి ఎన్ రెడ్డిహంసరెడ్డి, అఖిలభారత వ్యవసాయ కార్మిక సమఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోనె కుమార్‌స్వామి ఆగ్రహం వ్యక్తం చేశారు.

- అభిప్రాయ సేకరణలో అధికారులు మాట్లాడించిన వారు
- బొంపెల్లి దేవేందర్‌రావు, పర్వతగిరి, వర్ధన్నపేట – కాంగ్రెస్ పార్టీ వరంగల్ జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు
- తక్కళ్లపల్లి రవీందర్‌రావు, ఖానాపుర్, నర్సంపేట – మాజీ ఎంపీపీ, కాంగ్రెస్ పార్టీ వరంగల్ జిల్లా అధికార ప్రతినిధి
- పున్నం రవి – రేగొండ మండల కాంగ్రెస్ పార్టీ నాయకుడు(రవి భార్య లక్ష్మి, తాజా మాజీ ఎంపీపీ)
- భీంరెడ్డి కరుణాకర్‌రెడ్డి – ధర్మసాగర్, మాజీ ఎంపీటీసీ, కాంగ్రెస్ నాయకుడు
- గంగం బుచ్చిరెడ్డి– బచ్చన్నపేట, పీఏసీఎస్ మాజీ డైరెక్టర్
- మచ్చ సందీప్– కాంగ్రెస్ యూత్ నాయకుడు
- చిట్టిబాబు – యూత్ కాంగ్రెస్ నాయకుడు, వర్ధన్నపేట నియోజకవర్గం
- ఆదిరెడ్డి, దేవన్నపేట – ఆత్మ మాజీ చైర్మన్, హసన్‌పర్తి

ప్రజాభిప్రాయమే సర్కారు జీవో

ప్రజాభిప్రాయం ప్రకారమే రైతు భరోసా పథకం అమలు మార్గదర్శకాలను రూపొందిస్తామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, వ్యవసాయమంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు అభిప్రాయ సేకరణలో వచ్చిన అంశాలతోనే రైతు భరోసాపై ఉత్తర్వులు జారీ చేస్తామని చెప్పారు. రైతు భరోసా మార్గదర్శకాలపై ఉమ్మడి జిల్లాల వారీగా అభిప్రాయ సేకరణ జరుపుతున్నామని, ఈ అభిప్రాయాలపై శాసనసభలో చర్చించి తీర్మానం చేయనున్నట్టు చెప్పారు.

ప్రతి రైతుకు 'భరోసా' ఇవ్వాల్సిందే

మొదటిపేజీ తరువాయి...

నిబంధన పెడితే చాలా భూములు బీడువారిపోతాయి. సాగుచేసే భూమికే ఇస్తామంటే 30, 50 ఎకరాలు ఉన్నవారు ఖాళీగా ఉంచకుండా కౌలుకు ఇస్తారు. భూమి ఉన్న రైతులకే పథకం అందించాలి. రైతు పడే కష్టంలో రైతు భరోసా చిన్న పెట్టుబడి మాత్రమే. పంట నష్టపోతే పరిహారం ఇవ్వాలి. పండ్లు, కూరగాయల తోటలు పెట్టేలా రైతులను ప్రోత్సహించాలి. క్షేత్రస్థాయిలోకి వెళ్లి ఏ రైతు ఏ పంట వేస్తున్నాడన్న వివరాలు సేకరించి అర్హులకు రైతు భరోసా అమలు చేయాలి. వర్షాలు పడితే తొవ్వలు ఇబ్బందిగా ఉంటున్నాయి. గ్రామాల్లో సీసీ రోడ్లు వేయడం కాదు, బాయిలకాడికి వెళ్లేందుకు కూడా రోడ్లు వేయాలి. కూరగాయల విత్తనాలను సబ్సిడీపై అందించాలి' అని రమాదేవి కోరారు.

ఎస్‌వోసీలపై 4 వారాల్లో కౌంటర్ వేయండి

ఏపీ ప్రభుత్వానికి బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ ఆదేశం

హైదరాబాద్, జూలై 15 (నమస్తే తెలంగాణ): కృష్ణా జలాల పంపిణీకి సంబంధించిన స్టేట్‌మెంట్ ఆఫ్ కేస్ (ఎస్‌వోసీ)లపై ఏపీ ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేసేందుకు బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ 4 వారాల సమయం ఇచ్చింది. కౌంటర్ దాఖలుకు ఇదే చివరి అవకాశమని సోమవారం జరిగిన విచారణలో ట్రిబ్యునల్ చైర్మన్ జస్టిస్ బ్రిజేశ్ కుమార్ స్పష్టం చేశారు. తదుపరి విచారణను ఆగస్టు 28, 29 తేదీలకు వాయిదా వేశారు.

ప్రతి పనికి పైసా వసూల్!

- సచివాలయంలో సీఎం తమ్ముడి మకాం
- బీజేపీ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్

హైదరాబాద్, జూలై 15 (నమస్తే తెలంగాణ): ఏడు నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దఎత్తున అవినీతిలో కూరుకుపోయిందని ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ ఆరోపించారు. సోమవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. మంత్రులంతా ప్రతి పనికి పైసా వసూలు చేసే కార్యక్రమంలో బిజీ అయ్యారని, సీఎం తమ్ముడు కూడా సచివాలయంలో రాత్రిదాకా మకాం వేసి డబ్బులు వసూలు చేస్తున్నారని విమర్శలు గుప్పించారు. వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కల్యాణలక్ష్మి చెక్కు కోసం రూ.7,500 ఇచ్చినా రాలేదని బాధితులు ఓ కాంగ్రెస్ నాయకున్ని నిలదీయడమే ఇందుకు నిదర్శనమన్నారు.

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న సీఎం

కాంగ్రెస్‌లో చేరిన మహిపాల్‌రెడ్డి

హైదరాబాద్, జూలై 15 (నమస్తే తెలంగాణ): పటాన్‌చెరు బీఆర్ఎస్ ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి సోమవారం కాంగ్రెస్‌లో చేరారు. జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో సీఎం రేవంత్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయనతోపాటు జహీరాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి